సాక్షి
నిజామాబాద్
బుధవారం । 2 ఏప్రిల్ । 2025



కొనుగోలు కేంద్రాలకే సై

ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుండడంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- 8లో ▸



అవగాహనతోనే..

ఆటిజం ఉన్న పిల్లలకు తల్లిదండ్రులు, సమాజం, ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు మద్దతుగా నిలవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.5 /20.9

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విదేశాలకు వెళ్లిన టీచర్ల వివరాలు కోరిన ఏసీబీ

నిజామాబాద్‌అర్బన్: విదేశాలకు వెళ్లిన టీచర్ల వివరాలను ఇవ్వాలని జిల్లా విద్యాశాఖను ఏసీబీ అధికారులు కోరారు. గత రెండేళ్లకాలంలో ఎంత మంది టీచర్లు విదేశాలకు వెళ్లారు, ఎన్ని రోజులు సెలవుల్లో ఉన్నారనే వివరాలను అందించాలన్నారు. రెండు రోజుల్లో వివరాలు ఇస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు ఏసీబీ అధికారులకు తెలిపారు. టీచర్ల వివరాలను ఏసీబీ కోరడం జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశమైంది.

ఐసీడీఎస్‌లో అక్రమాలపై ఫిర్యాదు

నిజామాబాద్ నాగారం: జిల్లా సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఆయా విభాగాల్లో అక్రమ నియామకాలు జరిగాయని, పిల్లల దత్తత విషయంలో డబ్బులు అడుగుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ కమిషనర్‌కు గత నెల 29న గుర్తు తెలియని వ్యక్తులు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. పలువురు అధికారులు, ఉద్యోగులు శాఖ పరువును బజారుకు ఈడుస్తున్నారని ఫిర్యాదు లు వెళ్లాయని, త్వరలోనే నిజాలు బయటికి వస్తాయని శాఖ ఉద్యోగులు అంటున్నారు.

దర్యాపూర్ రైల్వేగేటు మూసివేత

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ రైల్వేగేటును రైల్వే అధికారులు మంగళవారం మూసివేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణ పనుల్లో భాగంగా తాత్కాలికంగా గేటును మూసివేస్తున్నట్లు అధికారులు రెండు రోజుల క్రితం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గేటు మూసివేతతో రాకపోకలు సాగించే ఫతేనగర్, రాంపూర్, ఎల్‌కె ఫా రం గ్రామస్తులతోపాటు దర్యాపూర్ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు కోతకు వచ్చిన సమయంలో గేటు మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు రైల్వే అధికారులను కలిసి సమస్యను విన్నవించారు. జీపీ లెటర్‌ప్యాడ్‌లపై సంతకాలు చేసి అందజేయగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైల్వే అధికారులు సమాధానమిచ్చారు.

వడ్డీ వ్యాపారి ఇంటిపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారి ఇంటిపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఓ రాజకీయ పార్టీలో కొనసాగుతున్న సదరు వ్యాపారి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాడనే సమాచారం మేరకు టీచర్స్‌కాలనీలోని ఆయన ఇంటిపై దాడి చేయగా 34 ద్విచక్ర వాహనాలు లభించినట్లు తెలిసింది. ఆ వాహనాలను ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌కు అప్పగించి, వడ్డీ వ్యాపారితో సంబంధాలున్న మరో నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

జిల్లా కేంద్రంలోని దుబ్బలో రేషన్‌షాపు వద్ద కార్డుదారుల క్యూ







సన్నబియ్యం సర్వత్రా హర్షం

ప్రతినెలా
8,248
మెట్రిక్ టన్నులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాల్లోని 13,10,012 మందికి ప్రతినెలా 8248.076 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. జిల్లాలో 3,80,222 కుటుంబాలకు ఆహార భద్రత కార్డులు ఉండగా, అందులో 12,50,996 మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 7505.856 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అంత్యోదయ కార్డులు 20,916 ఉండగా, వాటి పరిధిలోని 57,997 మందికి 732.060 మెట్రిక్ టన్నులు సన్నబియ్యం అందిస్తున్నామని వివరించారు. అన్నపూర్ణకార్డులు 1016 ఉండగా, 1039 మందికి 10.160 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

చాలా సంతోషంగా ఉంది

ప్రభుత్వం సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. పేదల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. బియ్యంలో నూకలు ఎక్కువగా ఉండకుండా చూడాలి. పేదల కల నెరవేరుస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– పెద్ద రాజవ్వ, రెంజర్ల

రేషన్ దుకాణాల ముందు బారులుతీరిన కార్డుదారులు

సుభాష్‌నగర్: సన్నబియ్యం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదల కల నెరవేరింది. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రంగా దేశ చరిత్రలో తెలంగాణ నిలిచింది. జిల్లావ్యాప్తంగా 759 రేషన్‌దుకాణాల ద్వారా మంగళవారం నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైంది. ఉదయం నుంచే కార్డుదారులు దుకాణాల వద్ద బారులు తీరారు. మొదటిరోజు 1,752 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పేదలకు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

అట్టహాసంగా ప్రారంభం

రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీని అట్టహాసంగా ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి లాంఛనంగా బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. నిజామాబాద్ నగరంలోని దుబ్బ, కోటగల్లి, అహ్మద్‌పురా కాలనీల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలకు హాజరయ్యారు. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సహాయ అధికారి రవి రాథోడ్, అధికారులు పాల్గొన్నారు.

- మొదటిరోజు 1752 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- మల్లారంలో పంపిణీని ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



శివాజీనగర్ రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న తాహెర్, కేశ వేణు

పేదల కోరిక నెరవేరింది



రేషన్‌షాపుల్లో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడంతో పేదలకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. భూమి లేని పేదలకు సన్నబియ్యం తినాలని కోరిక ఉంటుంది. ఆ కోరికను ప్రభుత్వం నెరవేరుస్తోంది. పథకం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వమే పకడ్బందీగా అమలు చేయాలి.

– రవీందర్‌గౌడ్, లబ్ధిదారుడు, గడ్కోల్

శుభపరిణామం



సన్న బియ్యం సరఫరా చేయడం శుభపరిణామం. గతంలో సరఫరా చేసిన దొడ్డు బియ్యాన్ని ప్రజలు తినలేక అమ్ముకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. పేద, మధ్యతరగతి ప్రజలు సన్నబియ్యాన్ని అమ్ముకునే పరిస్థితి ఉండదు. – ఏ నగేశ్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

దొడ్డు బియ్యం తినలేకపోయాం



గతంలో రేషన్ షాపుల్లో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేకపోయాం. తినాలంటే పిల్లలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం సన్నబియ్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రతినెలా సన్నబియ్యం పంపిణీ చేస్తే ఈ ప్రభుత్వాన్ని ఎవరూ మర్చిపోరు. 30 కిలోల బియ్యం కొనాలంటే రూ.వేలల్లో ఖర్చయ్యేవి. – నాగలక్ష్మి, ఇంద్రాపూర్, నిజామాబాద్



మల్లారంలో బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సన్నబియ్యం కోసం ఎదురుచూశాం



సన్నబియ్యం కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తామని ప్రకటించినప్పటి నుంచి ఎదురుచూస్తున్నాం. ఈనెల నుంచి పంపిణీ చేస్తుండటం అభినందనీయం. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. – టి లక్ష్మి, సీతారాంనగర్ కాలనీ, నిజామాబాద్

ప్రజలు ఉత్సాహంగా వస్తున్నారు



దొడ్డు బియ్యం పంపిణీ చేసిన సమయంలో వినియోగదారులకు ఫోన్‌లు చేసి రమ్మని పిలిచేవాళ్లం. సన్నబియ్యం రావడంతో రేషన్ దుకాణానికి ప్రజలు ఉత్సాహంగా తరలివస్తున్నారు. తొలిరోజే 30 క్వింటాళ్ల వరకు బియ్యం లబ్ధిదారులకు అందజేశాం. – కౌడ ఇందిర, రేషన్ డీలర్, కమ్మర్‌పల్లి

కేబినెట్ బెర్త్‌పై ఉత్కంఠ

- మంత్రివర్గ విస్తరణ వార్తల నేపథ్యంలో జిల్లాలో ఆసక్తి
- సుదర్శన్‌రెడ్డికి బెర్త్ ఖాయమంటూ.. కేటాయించే శాఖపై చర్చోపచర్చలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరు, కీలకమైన పాలనా అంశాల్లో కచ్చితమైన నిర్ణయాలు తీసుకునే విషయంలో ప్రతి ఉమ్మడి జిల్లాకు కేబినెట్ మంత్రి ఉంటేనే, పథకాల అమలు పక్కాగా ఉంటుందనేది ప్రతి ఒక్కరి లెక్క. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 16 నెలలు అవుతున్నప్పటికీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మంత్రి లేకపోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాలోని ఆయా గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల్లో పనులతోపాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు మంత్రి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఆయా వర్గాలకు చెందిన వారు ఏదైనా అంశాన్నైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా నుంచి మంత్రి లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రేపే మంత్రివర్గ విస్తరణ!

కేబినెట్ విస్తరణకు కాంగ్రెస్ అధినాయకత్వం పచ్చజెండా ఊపిందని, ఈ నెల 3వ తేదీన మంత్రివర్గ విస్తరణ ఉన్నట్లు వార్తలు రావడంతో జిల్లా వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి బెర్త్ ఖాయమని తెలుస్తోంది. ఈ క్రమంలో సుదర్శన్‌రెడ్డికి విద్య లేదా హోంశాఖ కేటాయిస్తారనే చర్చ జోరందుకుంది. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి వస్తే ఆ తరువాత తమకు నామినేటెడ్ పదవుల కేటాయింపునకు మార్గం సుగమమైనట్లేనని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. కాగా సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ కేటాయించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నట్లు సమాచారం. ఆయన హామీ నేపథ్యంలోనే సుదర్శన్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో అనధికారిక మంత్రిగా అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ, ప్రమాణ స్వీకారం విషయమై అన్ని వర్గాల్లో ఉత్కంఠతో కూడిన ఎదురుచూపులు నెలకొన్నాయి.

ఎన్‌డీసీసీబీ చరిత్రలో ఘన విజయం

- రూ.63కోట్ల ఎన్‌పీఏ రికవరీ.. రూ.304 కోట్ల పంట రుణాల పంపిణీ
- ప్రతియేటా ఏప్రిల్ 1న సంబురాల దినోత్సవంగా జరుపుకోవాలి
- చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పిలుపు



ఎన్‌డీసీసీబీలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

సుభాష్‌నగర్: ఎన్‌డీసీసీబీ ఆధ్వర్యంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌పీఏ రూ.63 కోట్లు రికవరీ చేయడంతోపాటు రూ.304 కోట్ల పంట రుణాలు పంపిణీ చేసిందని, ఇది బ్యాంకు చరిత్రలోనే సాధించిన ఘన విజయమని చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి అన్నారు. ఎన్‌పీఏ రికవరీ ఊహించలేనిదని, మరో 7.82శాతం మాత్రమే ఎన్‌పీఏ మిగిలి ఉందని పేర్కొన్నారు. సీఈవో నాగభూషణం వందే అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరం అచీవ్‌మెంట్ సెలబ్రేషన్స్‌ను డీసీసీబీ సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ రమేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి సీఈవోతోపాటు పాలకవర్గ సభ్యులకు, సిబ్బందికి తినిపించారు. అనంతరం సిబ్బంది పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. డీసీసీబీ చరిత్రలోనే ఘన విజయం సాధించామని, బ్యాంకులో ప్రతిఏడాది ఏప్రిల్ 1న సంబురాల దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మిగతా ఎన్‌పీఏను రికవరీ చేసే వరకు పాలకవర్గం, ఉద్యోగులు విశ్రమించొద్దని సూచించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.781.82 కోట్ల డిపాజిట్లు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు రూ.1355.56 కోట్లు ఇచ్చామని గుర్తుచేశారు. బ్యాంకుకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి ఉద్యోగి కష్టపడాలన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ ఇచ్చే ప్రయత్నం పాలకవర్గం చేస్తుందని హామీనిచ్చారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, లింగన్న, సాయిరెడ్డి, పటేల్ రమేశ్, చంద్రునాయక్, జీఎంలు అనుపమ, సుమమాల, గజానంద్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్‌కు మరో యువకుడు బలి

- రూ.5 లక్షలకుపైగా పోగొట్టుకుని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి
- మృతుడిది రూరల్ మండలం ఆకుల కొండూర్



ఆకాశ్(ఫైల్)

నిజామాబాద్ రూరల్: ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారిన ఓ యువకుడు లక్షల రూపాయాలు పోగొట్టుకుని చివరకు తన ప్రాణాలను తీసుకున్నాడు. సుమారు రూ.5లక్షలకు పైగా పోగొట్టుకోవడంతో ఆత్మహత్యకు యత్నించిన సదరు యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన ఆకాశ్(24) ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. ఇటీవల లక్షల రూపాయలను గేమ్స్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఏమంటారోనని భయపడి ఐదారు రోజుల క్రితం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయమై రూరల్ సీఐ సురేశ్‌ను వివరణ కోరగా బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధం సరికాదు

- రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతోందా?
- హెచ్‌సీయూకు చెందిన గుంట భూమి అమ్మినా ఊరుకోబోం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



వాహనంలో ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను తరలిస్తున్న హైదరాబాద్ పోలీసులు

సుభాష్‌నగర్: ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధం విధిస్తూ అరెస్టులు చేయించడం సరికాదని, సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూములను పరిశీలించేందుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు ధనపాల్ సూర్యనారాయణ, పాయల శంకర్‌ను పోలీసులు మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్బంధించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేలు, నాయకులను అరెస్టు చేయడం సరికాదని, రాష్ట్రంలో ప్రజాపాలన ఉందా.. నియంత పాలన కొనసాగుతోందా అని ప్రశ్నించారు. కేసీఆర్ కోకాపేట భూములను అమ్మితే.. రేవంత్‌రెడ్డి ఏకంగా హెచ్‌సీయూ భూములు అమ్మకానికి పెడుతున్నాడని, ఈ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ పట్టిన గతి పట్టడం ఖాయమన్నారు. గుంట భూమి అమ్మినా ఊరుకోబోమని, ప్రజా ఉద్యమంగా మార్చి సెక్రెటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

హెచ్‌సీయూ భూములను అమ్మనీయం

- ఆ భూములను వెంటనే యూనివర్సిటీ పేరుతో నోటిఫై చేయాలి
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూములను అమ్మడం, కొనడం చేయకుండా అడ్డుకుంటామని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జేసీబీలు పాత బస్తీలో నడవవనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నడిపిస్తున్నారని, ఆయన రియల్ ఎస్టేట్ సీఎం అని విమర్శించారు. ఢిల్లీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అడ్మినిస్ట్రేషన్‌లో విఫలమయ్యారని, హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సీఎం పదవి కోసం గాంధీల కుటుంబానికి ఇచ్చిన వాగ్దానాల కోసమే రేవంత్‌రెడ్డి రూ.వేలకోట్ల విలువైన 400 ఎకరాల భూమిని అమ్ముతున్నాడని ఆరోపించారు. భూమిని కొన్నవారు గ్రీన్ ట్రిబ్యునల్, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం హెచ్‌సీయూను అంతర్జాతీయ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం భూములు అమ్ముకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు. హెచ్‌సీయూకు చెందిన 2500 ఎకరాల భూమిని వెంటనే యూనివర్సిటీ పేరుతో నోటిఫై చేయాలని డిమాండ్‌చేశారు. అలాగే అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలని, హెచ్‌సీయూకు పర్మినెంట్ బౌండరీ ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌ అర్బన్‌: రాజీవ్‌ యువ వికాసం పథకానికి ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు అందించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్‌ యువ వికాసం పథకం తీసుకువచ్చిందన్నారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలు, మున్సిపాలిటీల్లోని ప్రజా పాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, ఈబీసీ వర్గాల నిరుద్యోగ యువత పూర్తి చేసిన దరఖాస్తులను కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్‌, పాన్‌ కార్డు, పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటో, ఫోన్‌ నంబర్‌ను జత చేసి ప్రజాపాలన సేవా కేంద్రాలలో అందించాలని సూచించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు అందించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

సామ్మొకరిది.. సోకొకరిది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌

సుభాష్‌నగర్‌: రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీపై సామ్మొకరిది.. సోకొకరిది అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వ తీరు ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతుల నుంచి ధాన్యం రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తోందని, ఈ సమయంలో రైతులకు ఎలాంటి ఆర్థికభారం పడకూడదనే ఉద్దేశంతో కేంద్రం గోనె సంచులు, దారం, రవాణా చార్జీలు, హమాలీ, మిల్లింగ్‌ చార్జీలను భరిస్తోందని అన్నారు. కార్డుదారులకు రేషన్‌ షాపుల ద్వారా పంపిణీ చేసే 6 కిలోల బియ్యంలో 5 కిలోలు కేంద్రం, కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకు కేంద్రం అందిస్తున్న బియ్యాన్ని తాము ఇస్తున్నట్లు కాంగ్రెస్‌ ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు.

ఆర్‌అండ్‌బీ ఈఈగా విక్రమ్‌కు అదనపు బాధ్యతలు

నిజామాబాద్‌నాగారం: ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈగా డిప్యూటీ సూపరింటెండెంట్‌ విక్రమ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి ఈఈగా విధులు నిర్వహించిన శ్రీమన్నారాయణ మార్చి 31న పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎస్‌ఈ సర్కిల్‌ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్‌ విక్రమ్‌కు అదనపు బాధ్యతలు నిర్వర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

కొనుగోలు కేంద్రాలకే సై

- వ్యాపారులకు సన్నధాన్యం విక్రయానికి ససేమిరా
- రైతుల మనస్సులో మార్పుతెచ్చిన బోనస్‌
- చేతికొచ్చిన యాసంగి సీజన్‌ సన్నధాన్యం

యాసంగి సీజన్‌లో వేల్పూర్‌ మండలం రామన్నపేట్‌ గ్రామ పరిధిలో రైతులు 1500 ఎకరాల్లో వరి సాగు చేయగా, 90శాతానికిపైగా సన్న రకాలే ఉన్నాయి. పంట కోతలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకు 170 ఎకరాల్లో పూర్తయ్యాయి. ధాన్యాన్ని ఆరబెట్టి సంచుల్లో నింపిన రైతులు.. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు వచ్చినా విక్రయించడం లేదు.


వేల్పూర్‌ మండలం రామన్నపేట్‌ శివారులో కుప్పలుగా పోసిన ధాన్యం

మోర్తాడ్‌(బాల్కొండ): ప్రభుత్వం సన్నాలకు బోనస్‌ ఇస్తుండడంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల ధాన్యం చేతికి వచ్చినప్పటికీ వ్యాపారులకు విక్రయించడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే ధాన్యానికి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,320తోపాటు రూ.500 చొప్పున బోనస్‌ జమ చేస్తుండటంతో రైతుల మనస్సుల్లో మార్పు వచ్చింది. వేల్పూర్‌ మండలంలోని రామన్నపేట్‌ పరిధిలో సహకార సంఘం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రెండు కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభించనున్నారు. ఇప్పటికే సహకార సంఘం కొనుగోలు కేంద్రం ద్వారా 128 టోకెన్‌లను జారీ చేయడం విశేషం. మహిళా సమాఖ్య సభ్యులు ధాన్యం కొనుగోళ్ల విషయంలో శిక్షణ పూర్తి చేసుకుని రాగానే వారు కూడా టోకెన్‌లను జారీ చేసే అవకాశం ఉంది. ఇది ఒక్క రామన్నపేట్‌ రైతులకు కలిసి వచ్చిన అంశమే కాదు. వరి సాగు చేసిన అన్ని గ్రామాల్లోనూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రైవేట్‌ వ్యాపారం లేనట్టే..!

ధాన్యం కొనుగోళ్లలో మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కొన్ని గ్రామాల్లో వరి సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని సహకార సంఘం కొనుగోలు కేంద్రంతోపాటు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోనూ మరో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించాలని తీర్మానించారు. బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్‌, భీమ్‌గల్‌, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్‌, బాల్కొండ, వేల్పూర్‌ మండలాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు గతంలో జిల్లాకు చెందిన వ్యాపారులతోపాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చేవారు. తేమ శాతం ఎలా ఉన్నా క్వింటాల్‌ ధాన్యానికి రూ.2,500 వరకు చెల్లించేవారు. హమాలీలకు కూలి చెల్లించే భారం, తూకంలో కోత లేక పోవడం, పచ్చి ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయడంతో మద్దతు ధర కన్నా రూ.500 తగ్గినా రైతులు వెనక్కి రాలేదు. గత వర్షాకాలం సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్న రకం ధాన్యానికి బోనస్‌ చెల్లించడతో ప్రభుత్వంపై నమ్మకం బలపడింది. బోనస్‌తో తమకు కలిసి వస్తుందనే ఆశతోనే రైతులు యాసంగిలోను సన్న రకాలను సాగు చేయడం విశేషం. గంగాకావేరి, ఆర్‌ఎన్‌ఆర్‌ రకాలనే ఎక్కువగా సాగు చేశారు. ఈ రకం ధాన్యానికి బోనస్‌ చెల్లించే అవకాశం ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు చూస్తున్నారు.

వ్యాపారులకు విక్రయించే పరిస్థితి లేదు

యాసంగి సీజన్‌లోనూ సన్న రకాలను సాగు చేయగా బోనస్‌ పొందాలనే ఉద్దేశంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని నిర్ణయించడం, యాసంగి సీజన్‌లో ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉండే అవకాశం ఉండటంతో కొనుగోలు కేంద్రాల వైపే రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– జాగీరపు శోభన్‌రెడ్డి, రైతు, రామన్నపేట్‌

అవగాహనతోనే ఆటిజం దూరం

- బాల్యంలో వేధిస్తున్న మందబుద్ధి సమస్య
- ప్రతి వంద మంది పిల్లల్లో ఇద్దరికి వచ్చే అవకాశం
- నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం



నిజామాబాద్‌నాగారం: కొంతమంది ఏ సమస్య వచ్చినా వెంటనే గూగుల్‌ శోధించి ఉన్నవీ లేనివి తమకు ఆపాదించుకుంటారు. అనవసరమైన భయాందోళనలకు గురవుతుంటారు. తమ సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో తెలియకుండానే కొన్ని తప్పులు చేస్తుంటారు. ఈ క్రమంలో ఆటిజం సమస్య ఉన్న పిల్లల విషయంలో సైతం తల్లిదండ్రులు ఇలాంటి తప్పులు చేసే అవకాశం ఉంది. నేడు 'ప్రపంచ ఆటిజం దినోత్సవం' సందర్భంగా పిల్లలకు ఆటిజం ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.. పేరు పెట్టి పిలిచినా పలకకపోవడం, ఐ కాంటాక్ట్‌ సరిగా లేకపోవడం, వారి వంక చూసి నవ్వినప్పుడు తిరిగి నవ్వకపోవడం.. వంటి లక్షణాలు ఆటిజం సమస్య ఉన్న పిల్లల్లో కనిపిస్తుంటాయి. జన్యుపరమైన, ఇతరత్రా వివిధ కారణాల వల్ల మన దేశంలో ప్రతి వంద మంది చిన్నారుల్లో ఇద్దరు ఇలాంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

వాటిని నమ్మడం ఆపేయండి

ఇంటర్నెట్‌ వ్యాప్తి పెరిగిన తర్వాత ఏ సమస్య వచ్చినా గూగుల్‌ చేస్తున్నారు. అందులో చెప్పిన విషయాలను ఆచరించడానికి ప్రయత్నిస్తుంటారు. అయితే కొన్ని రకాల సమస్యల విషయంలో ఇది సరైన మార్గం కాదంటున్నారు నిపుణులు. ఇంటర్నెట్‌లో ఎంతో సమాచారం ఉంటుంది. ఇందులో సంబంధం లేని సమాచారం కూడా ఉంటుంది. దీని వల్ల మరికొన్ని అనుమానాలు పుట్టుకొస్తుంటాయి. ఇది పిల్లల ఆరోగ్యంపై పడే అవకాశమూ ఉంటుంది. కాబట్టి, ఇంటర్నెట్‌లో ఉండే సమాచారాన్ని నమ్మకుండా మీకు అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత నిపుణుల అభిప్రాయం తీసుకోవడం ఉత్తమం.

సొంత చికిత్స వద్దు..

ఈ రోజుల్లో ఏదైనా తెలియకపోతే యూట్యూబ్‌ చూసి నేర్చుకోవడం సాధారణంగా మారిపోయింది. కొంతమంది తల్లిదండ్రులు ఆటిజం సమస్య గురించి యూట్యూబ్‌లో వెతికి ఇంట్లోనే వారికి శిక్షణ ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటారు. ఇది ఏమాత్రం మంచిది కాదు. ఎందుకంటే ఆటిజం లక్షణాలు అందరిలో ఒకేరకంగా ఉండకపోవచ్చు. దీనికి స్పష్టమైన చికిత్స అంటూ ఏదీ లేదు. లక్షణాలను బట్టి ఆక్యుపేషనల్‌ థెరపీ, స్పీచ్‌ థెరపీ, బిహేవియరల్‌ థెరపీ.. వంటివి ఇస్తుంటారు. కాబట్టి, సంబంధిత నిపుణులను సంప్రదించి వారు చెప్పే జాగ్రత్తలు పాటించడం మంచిది.

బలవంతం చేయొద్దు

ఆటిజం ఉన్నవారిలో కొంతమంది తమ కంటే తక్కువ వయసున్న పిల్లల్లాగా ప్రవర్తిస్తుంటారు. అయితే తల్లిదండ్రులు మాత్రం పిల్లలు ఏ వయసులో చేయాల్సిన పని ఆ వయసులో చేయకపోతే కంగారుపడుతుంటారు. కొంతమంది బలవంతం కూడా చేస్తుంటారు. ఉదాహరణకు ఓ ఏడేళ్ల అమ్మాయి ఇంకా నర్సరీ రైమ్స్‌ చూస్తుంటే కొంతమంది తల్లిదండ్రులు ఇబ్బంది పడుతుంటారు. ఇవి వారి కంటే చిన్న పిల్లలు చూడాల్సినవని.. వారి వయసులో చూడాల్సిన ప్రోగ్రామ్స్‌ను బలవంతంగా చూపించే ప్రయత్నం చేస్తుంటారు. దీనివల్ల వారు వాటిని చూడకపోగా మరింత కుంగుబాటుకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, వారికి నచ్చని విషయాల్లో బలవంతం చేయకపోవడమే మంచిది.

అవగాహన.. మద్దతు అవసరం



ఆటిజం ఉన్న పిల్లలకు సమాజం, ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు కలిసికట్టుగా మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు సమయానికి వైద్య సలహా తీసుకోవడం, సమగ్ర విద్య విధానాలను అమలు చేస్తే బాగుంటుంది.

– ప్రొఫెసర్‌ విశాల్‌, న్యూరోసైకియాట్రిస్ట్‌

ఇతరులతో పోల్చకండి..

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోలుస్తుంటారు. వారిలాగా ఉండమని తమ పిల్లలకు చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల ఆటిజం సమస్యలు తగ్గుతాయని భావిస్తుంటారు. అయితే ఈ పద్ధతి ఏమాత్రం మంచిది కాదు. ఎందుకంటే ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. అలాగే ఆటిజం ఉన్న వారిలో కూడా ఎన్నో నైపుణ్యాలు ఉంటాయి. ఇలా ఆటిజం ఉన్నప్పటికీ అపురూప విజయాలు సాధించిన వ్యక్తులు ఎంతోమంది ఉన్నారు. కాబట్టి, ఇలాంటి వారిని ఉదాహరణగా తీసుకుని పిల్లల్లోని ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి దానికి తగ్గ తోడ్పాటు అందించాలి. అంతేకానీ ఇతరులతో పోల్చకూడదు.

హెగ్డోలిలో కుస్తీ పోటీలు

రుద్రూర్‌: పొతంగల్‌ మండలం హెగ్డోలిలో మంగళవారం ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ప్రతి ఏడాది ఉగాది తర్వాత గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు తెలిపారు. కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాతోపాటు, సమీప మహారాష్ట్ర గ్రామాల నుంచి కుస్తీ వీరులు వచ్చారు. విజయం కోసం హోరాహోరీగా తలపడ్డారు. పోటీలను తిలకించడానికి సమీప గ్రామాల నుంచి తరలివచ్చారు. మాజీ ఎంపీపీ పుప్పాల శంకర్‌, ఉమాకాంత్‌ దేశాయ్‌, నాగం సాయిలు, రాంబాబు, సంఘమేశ్వర్‌ పాల్గొన్నారు.


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

భూముల వేలాన్ని ఆపాలి



తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాద్‌ సెంట్రల్‌యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్‌ చేశారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిరసిస్తూ మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో సెంట్రల్‌ లైబ్రరీ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి శివ, నాయకులు తరుణ్‌, సమీర్‌, అజయ్‌, అశోక్‌, రాము, పృథ్వీ, అనిల్‌, నరేందర్‌, శివ, అశ్విత్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నిజామాబాద్‌ సిటీ: రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ గెలుపే లక్ష్యంగా యువజన విభాగం నేతలు పనిచేయాలని రాష్ట్ర నాయకులు సూచించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో మంగళవారం యువజన కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్‌ అధ్యతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు రంగనాథ్‌, వెంకటరామారావు మాట్లాడుతూ.. పార్టీలో యువజన కాంగ్రెస్‌ పునాదిలాంటిదన్నారు. పార్టీ తీసుకునే ప్రతీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసే బాధ్యత యువజన కాంగ్రెస్‌దేనన్నారు. పార్టీ చేపట్టిన జై బాపు- జై భీం-జై సంవిధాన్‌ పాదయాత్రల్లో యువజన కాంగ్రెస్‌ కీలకపాత్ర పోషించాలని సూచించారు. నాయకులు విక్కీయాదవ్‌, నరాల నిహార్‌, అనుపాల్‌ కిరణ్‌, నరేందర్‌ గౌడ్‌, ఆదిత్య పాటిల్‌, ఇర్ఫాన్‌, రాజుగౌడ్‌, రషీద్‌, ముద్దసిర్‌ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు

మోపాల్‌: మండలంలోని కులాస్‌పూర్‌ తండా, కంజర్‌ శివార్లలో మంగళవారం రాత్రి వేర్వేరు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కులాస్‌పూర్‌ తండా శివారులో ఇసుక లోడ్‌తో వస్తున్న మినీ వ్యాన్‌, కులాస్‌పూర్‌ నుంచి వెళ్తున్న ప్యాసింజర్‌ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్లు ఖాజా, గంగాధర్‌తోపాటు ప్రయాణికులు కృతిక్‌, మరో పాప, మహిళకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అలాగే కంజర్‌ శివారులో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. కంజర్‌కు చెందిన రామర్తి సురేశ్‌ మోపాల్‌ వైపు, కులాస్‌పూర్‌కు చెందిన మరో వ్యక్తి గ్రామం వైపు వెళ్తుండగా, ఎదురెదురుగా ఢీకొన్నారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి

నస్రుల్లాబాద్‌/నిజాంసాగర్‌/మద్నూర్‌/గాంధారి : అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సైలు కోరారు. మంగళవారం జుక్కల్‌ మండల కేంద్రంలో ఎస్సై భువనేశ్వర్‌, గాంధారి మండలం సోమారం తండాలో ఎస్సై ఆంజనేయులు సైబర్‌ నేరాలు, దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, అందరూ ఐకమత్యంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. దొంగతనాలు అరికట్టడానికి ప్రజలు సహకరించాలని నస్రుల్లాబాద్‌ ఎస్సై లావణ్య అన్నారు. మద్నూర్‌లోని అన్ని కాలనీల్లో ఆటోలో మైక్‌సెట్‌ ఏర్పాటు చేసుకోని తస్మాత్‌ జాగ్రత్త అంటూ పోలీసులు ప్రచారం నిర్వహించారు. సైబర్‌ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

క్రైం కార్నర్‌

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నందిపేట్‌: మండలంలోని ఉమ్మెడ శివారులోని గోదావరి నది బ్యాక్‌ వాటర్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు నందిపేట ఎస్సై చిరంజీవి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గోదావరి నదిలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి జాలర్ల ద్వారా మృతదేహాన్ని బయటకు తీశామన్నారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తించడానికి వీలు లేకుండా ఉందన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.


డ్రంకన్‌ డ్రైవ్‌, న్యూసెన్స్‌ కేసుల్లో పలువురికి శిక్ష

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పీఎస్‌ పరిధిలో స్పెషల్‌ డ్రైవ్‌, డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన ఆర్మూర్‌ పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన దేవరాజుకు మూడు రోజుల సాధారణ జైలు శిక్షను ఆర్మూర్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ పేర్కొన్నారు. అలాగే కమ్మర్‌పల్లికి చెందిన షేక్‌ మునీర్‌ బైక్‌ను అత్యంత ధ్వనితో ఆర్మూర్‌ నగరంలో నడుపుతూ న్యూసెన్స్‌ సృష్టించడంతో అతనికి రెండు రోజుల సాధారణ జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బోధన్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణ పీఎస్‌ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తికి సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శేష తల్ప సాయి రెండు రోజుల జైలు శిక్షను విధించారని పట్టణ సీఐ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సీఐ సూచించారు.

యువకుడి అదృశ్యం



రుద్రూర్‌: మండల కేంద్రానికి చెందిన కర్రోళ్ల విజయ్‌కుమార్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గతేడాది ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. నాటి నుంచి మతిస్థిమితం సరిగా లేదు. గత నెల 11న ఇంట్లోంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో విజయ్‌కుమార్‌ భార్య ప్రియాంక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విజయ్‌ ఆచూకీ తెలిసిన వారు నంబర్‌ 87126 59876 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రానికి చెందిన వన్నె సుభాష్‌(42) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరికి చెందిన సుభాష్‌ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని భార్య కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లి పోయింది. నాటి నుంచి సుభాష్‌ ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం ఇంటి నుంచి సుభాష్‌ బయటకు రాకపోవడంతో చుట్టు పక్కల వారు ఆయన తమ్ముడికి సమాచారం అందించారు. రాత్రి స్థానికులతో కలిసి తలుపులు తీసి చూడగా ఉరేసుకొని ఉన్నాడు. మృతుడి తమ్ముడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాడ్కోల్‌ చౌరస్తాలో చైన్‌స్నాచింగ్‌

బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్‌ చౌరస్తాలో మంగళవారం చైన్‌స్నాచింగ్‌ జరిగినట్లు సీఐ అశోక్‌ తెలిపారు. పిట్లం మండలం సిద్దాపూర్‌ గ్రామానికి చెందిన బాల పోచవ్వ చౌరస్తాలో బస్సు ఎక్కుతుండగా దుండగులు ఆమె మెడలోని గుండ్లను అపహరించారు. సుమారు ఏడు గ్రాముల బంగారు గుండ్లు అపహరణకు గురయ్యాయని బాధితురాలు గుర్తించి బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతరలో తప్పిపోయిన పాప

- అక్కున చేర్చుకొని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


కుటుంబసభ్యుల చెంతకు చేరిన పాప

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో జరుగుతున్న నల్లపోచమ్మ జాతర ఉత్సవాల్లో మంగళవారంరాత్రి మూడేళ్ల పాప తప్పిపోయింది. ఆలయ పరిసరాలలో ఒంటరిగా ఏడుస్తూ నిలబడ్డ పాపను గమనించిన నాగిరెడ్డిపేట పోలీసులు అక్కున చేరుకొని తల్లిదండ్రుల వివరాలను రాబట్టారు. తన తండ్రి పేరు సురేందర్‌ అని, తల్లి పేరు సౌజన్య అని, తమ ఊరు గాజిరెడ్డిపల్లి అని మాత్రమే పాప తెలిపింది. దీంతో పాప తప్పిపోయిన విషయాన్ని, ఈమె కుటుంబసభ్యుల వివరాలను వారు సోషల్‌మీడియాలో వైరల్‌ చేశారు. కొద్దిసేపటికే పాప సంబంధీకులు ఆలయం వద్ద పోలీసుల వద్దకు చేరుకొని జాతరలో తప్పిపోయిన పాప తమ పాపేనని చెప్పారు. దీంతో పూర్తి విచారణ చేపట్టిన కానిస్టేబుల్‌ గంగారాం పాపను కుటుంబసభ్యులకు అప్పగించారు.

జీజీహెచ్‌లో బాలుడు..


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసు

ఖలీల్‌వాడి: నగరంలోని జీజీహెచ్‌ నుంచి తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన కేషిరెడ్డి లత తన రెండున్నరేళ్ల బాబును తీసుకుని గవర్నమెంట్‌ హాస్పిటల్‌కు వచ్చింది. ఈ క్రమంలో బాబు ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చాడు. బస్టాండ్‌ ఏరియాలో డ్యూటీలో ఉన్న మహిళా హెడ్‌ కానిస్టేబుల్‌ బాబును చేరదీసి తన తల్లికి అప్పగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని బయటకు వచ్చినప్పుడు వారిపై దృష్టి పెట్టాలని ఎస్‌హెచ్‌వో కోరారు.

ఆన్‌లైన్‌ షాపింగ్‌లో మోసపోయిన మహిళ

ఎల్లారెడ్డి: ఆన్‌లైన్‌ షాపింగ్‌లో ఓ మహిళ మోసపోయినట్లు ఎస్సై మహేశ్‌ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన శేర్ల భావన అనే మహిళ ఇన్‌స్టాగామ్‌లో గత నెల 26న ఆన్‌లైన్‌ షాపింగ్‌లో డ్రెస్‌ బుక్‌ చేశారు. గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్‌ చేసి బుక్‌ చేసిన డ్రెస్‌ పంపుతున్నాం కానీ మీరాష్ట్రంలో ట్యాక్స్‌ చెల్లించాల్సి వస్తోంది మీరు ముందుగానే రూ. మూడు వేలు చెల్లిస్తే డ్రెస్‌ డెలివరీ కాగానే డబ్బులు రిటన్‌ వస్తాయని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన భావన విడతల వారిగా రూ. 40వేల118 చెల్లించింది. ఎంతకీ డ్రెస్‌, డబ్బులు రాకపోవడంతో ఆమె 1930కి ఫోన్‌ చేసి ఫిర్యాదు చేయడంతో రూ. 16వేలు హోల్డ్‌లో ఉన్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఫోన్‌ చేస్తే ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని, ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై సూచించారు.

అపరిచితులను చితకబాదిన గ్రామస్తులు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌లో ఇద్దరు అపరిచితులను గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి చితకబాదారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం బస్వాపూర్‌ బస్టాండ్‌ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒకరిని గ్రామస్తులు పట్టుకుని విచారించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో చితకబాదారు. అలాగే గ్రామంలో మరో వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో గ్రామస్తులు పట్టుకుని ప్రశ్నించి చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లగా గ్రామస్తులకు పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు గ్రామస్తుల చేతిలో గాయపడ్డ అపరిచితులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్‌ నేత మృతి

బోధన్‌టౌన్‌: బోధన్‌ ఏఎంసీ చైర్మన్‌, సీనియర్‌ న్యాయవాది వీఆర్‌ దేశాయ్‌ కుమారుడు ప్రీతమ్‌ దేశాయ్‌(46) మంగళవారం గుండె పోటుతో మృతి చెందాడు. బీఆర్‌ఎస్‌ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మృతుడి నేత్రాలను కుటుంబీకులు లయన్స్‌ కంటి ఆస్పత్రికి దానం చేశారు. అంత్యక్రియలు స్వగ్రామమైన రుద్రూర్‌ మండల కేంద్రంలోని నివాసం వద్ద బుధవారం ఉదయం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న సప్తగిరి అసోసియేట్స్‌లో షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన యజమాని వెంటనే అగ్ని మాపకశాఖకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ. లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి



సిరికొండ: మండలంలోని తూంపల్లికి చెందిన దాసరి రజనీశ్‌(38) కొబ్బరి చెట్టు పై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ మంగళవారం తెలిపారు. రజనీశ్‌ కొబ్బరికాయలు తెంపడానికి సోమవారం కొబ్బరి చెట్టు పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్బర్‌నగర్‌ శివారులో కారు బోల్తా



రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ శివారులో మంగళవారం కారు బోల్తా పడింది. కాగా కారులో ఉన్న వ్యక్తి పారిపోయినట్టు తెలిసింది. విషయం తెలుసుకున్న రుద్రూర్‌ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి స్థానికుల ద్వారా ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఓ పోలీసు వాహనం వెంబడిస్తున్న సమయంలో కారు బోల్తా పడినట్టు తెలిసింది. కారును పోలీసులు ఎందుకు వెంబడించారు. కారు బోల్తాపడగానే అందులో ఉన్న వ్యక్తి ఎందుకు పారిపోయాడనేది వివరాలు తెలియరాలేదు. ఈ విషయమై స్థానిక ఎస్సై సాయన్న ను వివరణ కోరగా ప్రమాదానికి గురైన కారును రుద్రూర్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బాన్సువాడ రూరల్‌: మండలంలోని కొయ్యగుట్ట శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 4,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.